
క్లుప్తంగా

బీఎస్‌ఎఫ్ బలగాల కవాతు



నెల్లూరు(క్రైమ్): రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటును వినియోగించుకోవాలని చిన్నబజారు ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ సూచించారు. ఓటర్లకు భద్రత, భరోసా కల్పించేందుకు నగరంలోని చిన్నబజారు పోలీసు స్టేషన్ పరిధిలోని జెండావీధి, కోటమిట్ట, మన్సూర్‌నగర్, మెక్లిన్స్‌రోడ్డు, తదితర ప్రాంతాల్లో బీఎస్‌ఎఫ్ బలగాలు, పోలీసులతో శనివారం కవాతు నిర్వహించారు. చిన్నబజారు పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన



నెల్లూరు(వీఆర్సీసెంటర్): రంగనాయకులపేటలోని కపాడిపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి విజయలక్ష్మి పాల్గొని గర్భిణులు, బాలింతాలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. చిరుధాన్యాలతో వండిన వంటకాలు, వాటి ఉపయోగాలను వివరించారు. అంగన్‌వాడీ సిబ్బంది శైలజ, సుబ్బరత్నమ్మ, లలిత, తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా పారిశుధ్య పనులు



నెల్లూరు(బారకాసు): నగరంలోని అన్ని డివిజన్లలో పారిశుధ్య పనులను ప్రణాళికాబద్ధంగా చేపడుతున్నామని కార్పొరేషన్ ఎంహెచ్‌ఓ వెంకటరమణ పేర్కొన్నారు. చిన్నబజారు, పెద్దబజారు, లక్ష్మీపురం, అంబేద్కర్‌నగర్, తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైనేజీల్లో పూడికతీత పనులను క్రమం తప్పకుండా చేపడుతూ మురుగు ప్రవాహానికి అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దోమల నివారణ చర్యల్లో భాగంగా డ్రైనేజీల్లో క్రమం తప్పకుండా దోమల లార్వా నివారణా మందు పిచికారీ చేయిస్తున్నామని చెప్పారు. ఎన్టీఆర్‌నగర్, మూలాపేట, డైకస్‌రోడ్డు, వెంగళరావునగర్, లేక్‌వ్యూకాలనీ, ఫత్తేఖాన్‌పేట తదితర ప్రాంతాల్లో దోమల నివారణకు భారీ వాహనాల సాయంతో ఫాగింగ్ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. వాహనాలు ప్రవేశించలేని ప్రాంతాల్లో పారిశుధ్య కార్మికులతో ఫాగింగ్ చేపడుతున్నామని వివరించారు. ప్రజలంతా బాధ్యతగా చెత్త సేకరణ వాహనాలు వచ్చినప్పుడే చెత్తను అందించాలని, పర్యావరణ హితమైన రీసైక్లింగ్ ప్రక్రియకు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు ఉన్నారు.

యానాదుల సొమ్మును కాజేసిన వారిపై పోరాటం

నెల్లూరు(వీఆర్సీసెంటర్):యానాదుల సొమ్మును కాజేసిన ఐటీడీఏ పీఓను జైలుకు పంపే వరకు పోరాటం సాగిస్తామని యానాదుల సంక్షేమ సంఘ రాష్ట్రాధ్యక్షుడు కేసీ పెంచలయ్య హెచ్చరించారు. నగరంలోని వెన్నెలకంటి రాఘవయ్య భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నెల్లూరు ఐటీడీఏలో నిధుల దుర్వినియోగంపై రాష్ట్ర సంక్షేమ శాఖ డైరెక్టర్ విచారణకు ఆదేశించారని తెలిపారు. అయితే పీఓ తన అవినీతి బయటపడుతుందనే ఉద్దేశంతో దాన్ని పక్కదారి పట్టించేందుకు నాయకులపై విమర్శలు చేస్తున్నారన్నారు. పీఓ అవినీతిపై సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరుతున్నామన్నారు. ఈ సమావేశంలో నాయకులు కృష్ణయ్య, మురళి, ఉష, వరలక్ష్మి, మల్లిక, ప్రభావతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల గుండెల్లో అమరజీవి స్థానం పదిలం

• కలెక్టర్ ఎం హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): ఆంధ్ర రాష్ట్రావతరణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగనిరతి వెలకట్టలేనిదని, తెలుగు ప్రజల గుండెల్లో ఆయన స్థానం ఎల్లప్పుడూ పదిలమని కలెక్టర్ ఎం హరినారాయణన్ అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ వద్దనున్న ఆయన విగ్రహానికి శనివారం కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలుగు భాష మాట్లాడే వారి కోసం ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం అమరజీవి చేసిన త్యాగం నేటి తరానికి ఆదర్శం కావాలన్నారు. దేశ చరిత్రలో ఎంతో మంది సమరయోధులు నేటికి ప్రజల మనస్సుల్లో నిలిచిపోయారని, వారిలో అమరజీవి ఒకరు అన్నారు. స్వాతంత్ర్య సంగ్రామంలో ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా వంటి ఎన్నో ఉద్యమాల్లో గాంధీజీ వెంట నడిచారన్నారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు అమరజీవి ప్రాణత్యాగ ఫలితమేనన్నారు. అమరజీవి జీవితాన్ని, వారి ఆశయాన్ని స్ఫూర్తిగా తీసుకుని జిల్లాకు మంచి పేరు తీసుకురావడంతో పాటు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమల్లో ముందంజలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా బీసీ సంక్షేమాధికారి వెంకటయ్య, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

•కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో అమరజీవి పొట్టి శ్రీరాములు 123వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అమరజీవి చిత్రపటానికి జిల్లా రెవెన్యూ అధికారి లవన్న పూలమాల వేసి నివాళులర్పించి ఆయన త్యాగనిరతిని స్మరించుకున్నారు. వినియోగదారుల ఫోరం జడ్జి జింకారెడ్డి శేఖర్, డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటయ్య, కలెక్టరేట్ సిబ్బంది, కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అమరజీవి త్యాగం అజరామరం

నెల్లూరు(బారకాసు): ఆంధ్ర రాష్ట్ర సాధనకు తన ప్రాణాలను సైతం తృణప్రాయంగా త్యజించిన అమరజీవి పొట్టిశ్రీరాములు నేటి సమాజానికి ఆదర్శమని కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్ కొనియాడారు. కార్పొరేషన్ కార్యాలయంలో అమరజీవి చిత్రపటానికి కమిషనర్‌తో పాటు పలువురు అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదనపు కమిషనర్ శర్మద, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఎస్‌ఈ సంపత్‌కుమార్, టీపీఆర్వో ప్రసాద్, మేనేజర్ ఇనయతుల్లా, ఆర్‌ఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

•ఏపీ ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఆత్మకూరు బస్టాండ్ కూడలిలోని అమరజీవి విగ్రహానికి ఆర్యవైశ్య ప్రముఖులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఏపీ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సేగు షణ్ముఖరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బ్రహ్మంగుప్తా, కార్యవర్గ సభ్యుడు భవనాసి సురేష్‌బాబు, దర్శి హరికృష్ణ, నెల్లూరు అర్బన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొండ ప్రవీణ శంకర్, పీవీశేషారావు, జొన్నలగడ్డ మోహన్‌రావు. తదితరులు పాల్గొన్నారు.



జెడ్పీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం

నెల్లూరు(క్రైమ్): ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం అమరజీవి పొట్టిశ్రీరాములు చేసిన త్యాగం చిరస్మరణీయమని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో అమరజీవి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పొట్టిశ్రీరాములు చిత్రపటానికి ఎస్పీతో పాటు పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అమరజీవి జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమన్నారు. ఇంతటి మహోన్నత వ్యక్తి జన్మించిన జిల్లాలో విధులు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, షఫి, ఆర్‌ఐ అంకమరావు, మినిస్టీరియల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ కార్యాలయంలో

నెల్లూరు(పొగతోట): జిల్లా పరిషత్ కార్యాలయంలో అమరజీవి చిత్రపటానికి జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, డిప్యూటీ సీఈఓ బీ చిరంజీవి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పొట్టి శ్రీరాములు త్యాగనిరతిని స్మరించుకున్నారు. జెడ్పీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అమరజీవి చిరస్మరణీయులు: ఎంపీ విజయసాయిరెడ్డి

నెల్లూరు(బారకాసు): ఆంధ్రుల మదిలో పొట్టిశ్రీరాములు చిరస్మరణీయులని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి అన్నారు. జిల్లా అర్బన్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నగరంలో నిర్వహించిన పొట్టిశ్రీరాములు జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. అమరజీవి విగ్రహం, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరజీవి త్యాగం వల్లే భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడ్డాయని వివరించారు. అమరజీవి త్యాగం మరువలేనిదని, ఆయన్ని భావితరాలు సదా స్మరించుకోవాలన్నారు. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నగర ఎమ్మెల్యే అభ్యర్థి ఖలీల్‌అహ్మద్, ఏపీ ఆర్యవైశ్య మహాసభ గౌరవాధ్యక్షుడు, నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్, రేపాల శ్రీనివాసరావు, అర్బన్ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు బైసాని జ్యోతిప్రసాద్, శ్రీరాం సురేష్, రాచపూటి పెంచలకుమార్, మేడా కామేశ్వరరావు, తుమ్మలపెంట మల్లికార్జున, నున్నా రమేష్, చందు, సత్యకృష్ణ, కనమర్లపూడి గోపికృష్ణ పాల్గొన్నారు.



అమరజీవికి నివాళులర్పిస్తున్న ఎంపీ విజయసాయిరెడ్డి



అమరజీవి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ హరినారాయణన్



కలెక్టరేట్‌లో పొట్టి శ్రీరాములు జయంతి ఉత్సవాల్లో మాట్లాడుతున్న డీఆర్వో లవన్న



కార్పొరేషన్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న కమిషనర్



జిల్లా పోలీసు కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఎస్పీ



నివాళులర్పిస్తున్న ఏపీ ఆర్యవైశ్య మహాసభ నేతలు

ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ బాధ్యతల స్వీకరణ



నెల్లూరు(బారకాసు): ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా పొట్లూరి రంగనాథ్‌సాయి శనివారం బాధ్యతలు చేపట్టారు. విజయవాడలోని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ కార్యాలయంలో మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసులు, ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్ సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పదవి బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి ఆర్యవైశ్యుల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. తనకు పదవి రావడానికి సహకరించిన నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్‌యాదవ్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని ఏకే నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని సింహపురి విద్యుత్ ఫీడర్, పోస్టల్ కాలనీ విద్యుత్ ఫీడర్‌లో మరమ్మతులు చేపడుతున్న కారణంగా ఆదివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగునని నెల్లూరుటౌన్ ఈఈ సోమశేఖర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని సింహపురికాలనీ, న్యూమిలటరీ కాలనీ, చైతన్యపురి కాలనీ, పోస్టల్ కాలనీ, వేదాయపాళెం సెంటర్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

వైజ్ఞానిక ప్రదర్శన

నెల్లూరు (టౌన్): సరస్వతినగర్‌లోని డా.కిషోర్స్‌రత్నం స్కూల్‌లో వైజ్ఞానిక ప్రదర్శనను శనివారం నిర్వహించారు. నెల్లూరు అర్బన్, రూరల్ ఎంఈఓలు బిక్షాలు, తిరుపాల్ రిబ్బన్ కట్‌చేసి వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభించి విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టు నమూనాలను తిలకించి అభినందించారు. రత్నం విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, జూనియర్ మేనేజర్ అజేయ్‌సింగ్, ఏఓ సునీల్, ప్రిన్సిపాల్స్ మణిమాల, ప్రపూర్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆదాల నివాసంలో సంబరాలు

నెల్లూరు సిటీ: వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేరును ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రకటించడంతో మినీబైపాస్‌రోడ్డులోని ఆదాల నివాసంలో పార్టీ శ్రేణులు, అభిమానులు సంబరాలు జరుపుకొన్నారు. పెద్ద ఎత్తున బాణసంచా పేల్చి హర్షం వ్యక్తం చేశారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుంచి ఆదాల ప్రభాకర్‌రెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని పార్టీ శ్రేణులు ధీమా వ్యక్తం చేశాయి. విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడి రంగారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వైవీ రామిరెడ్డి, ఏపీ స్టేట్ ఎంఎస్ ఎంఈ డైరెక్టర్ పాశం శ్రీనివాస్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వేలూరు శివసునీల్‌రెడ్డి, జిల్లా యూత్ అధ్యక్షుడు మంగళపూడి శ్రీకాంత్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ఏసునాయుడు పాల్గొన్నారు.



బాణసంచా పేల్చుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

మూల్యాంకనానికి అధ్యాపకులను పంపాలి

నెల్లూరు (టౌన్): ఇంటర్మీడియట్ జవాబు పత్రాల మూల్యాంకనానికి బోర్డు నియమించిన అధ్యాపకులను రిలీవ్ చేసి పంపాలని ఆర్‌ఐఓ శ్రీనివాసులు ఆయా జూనియర్ కళాశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాల్స్‌ను ఆదేశించారు. నగరంలోని కేఏసీ జూనియర్ కళాశాలలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఐఓ మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి కేఏసీ జూనియర్ కళాశాలలో మూల్యాంకనం ప్రారంభమవుతుందన్నారు. ఈ నెల 21 వరకు ఇంగ్లిష్, తెలుగు, హిందీ, మ్యాథమెటిక్స్, సివిక్స్, 25 వరకు ఫిజిక్స్, ఎకనామిక్స్, 28 వరకు బొటని, జువాలజీ, కామర్స్ సబ్జెక్ట్‌లకు సంబంధించిన మూల్యాంకనం జరుగుతుందన్నారు. అధ్యాపకులను పంపని ప్రిన్సిపాల్స్‌కు రోజుకు రూ.1000 వంతున అపరాధ రుసుం విధిస్తామన్నారు. అవసరమైతే కళాశాలల అనుమతుల రద్దుకు సిఫార్సు చేస్తామన్నారు. బోర్డు నిబంధనలకు విరుద్ధంగా వేసవిలో అడ్మిషన్లు, తరగతులు, వసతిగృహాలు నిర్వహించకూడదన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇంటర్‌బోర్డు పరిశీలకులు బహుగుణ మాట్లాడుతూ స్పాట్ కేంద్రాల్లో స్కానింగ్ ఏర్పాటు చేసి మూల్యాంకనాన్ని త్వరితగతిన పూర్తి చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం శ్రీపొట్టిశ్రీరాములు జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సమావేశంలో డీవీఈఓ మధుబాబు, ఆయా కళాశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌ఐఓ శ్రీనివాసులు

పది పరీక్షలకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా



నెల్లూరు(వీఆర్సీసెంటర్): పదోతరగతి పరీక్షలకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా అందించాలని ఏపీఎస్పీడీసీఎస్ జిల్లా ఎస్‌ఈ విజయన్ విద్యుత్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన నగరంలోని విద్యుత్ భవన్ నుంచి విద్యుత్ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనందున జిల్లాలోని అన్ని పోలింగ్ బూత్‌లలో విద్యుత్ సరఫరా ఉండాలని, ఎలాంటి అంతరాయం కలిగిన సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వేసవిలో విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని అందుకు తగినట్లుగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. డీలిస్టుపై సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టి నిర్ణీత గడువులోగా పూర్తిచేసి రెవెన్యూ కార్యాలయాలకు పంపాలన్నారు.విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించిన వారిపై శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి, టెక్నికల్ ఈఈ శేషాద్రి బాలచంద్ర పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించండి

నెల్లూరు సిటీ: వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి విజయసాయిరెడ్డి, నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా ఆ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు పాలకీర్తి రవి శనివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. దేవరపాళెంలో పంచాయతీ పరిధిలోని హరిజనవాడలోని ఇంటింటికి వెళ్లి వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా హరిజనవాడవాసులు మాట్లాడుతూ పదేళ్లుగా తమకు తాగునీరు అందించిన నాయకులు లేరని, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి రూరల్ నియోజకవర్గ సమన్వయకర్తగా బాధ్యతలు చేపట్టిన వెంటనే తమకు తాగునీటి వసతి కల్పించారని తెలిపారు. ప్రభుత్వ పథకాలు సైతం అందాయని చెప్పారు. తమ కాలనీలో 300 కుటుంబాల మద్దతు వైఎస్సార్‌సీపీకేనని పేర్కొన్నారు. పార్టీ నాయకులు స్వర్ణ జీవన్ ప్రసాద్, ఏఎంసీ డైరెక్టర్ ఆరవ కామాక్షమ్మ నగర మహిళా విభాగం జనరల్ సెక్రటరీ నాగలక్ష్మి, బెల్లంకొండ వెంకయ్య, ఆరవ మణి, రమేష్‌బాబు, పద్మ పాల్గొన్నారు



ప్రచారం చేస్తున్న పాలకీర్తి

నారాయణలో అరుదైన ఈఎన్‌టీ శస్త్రచికిత్స

నెల్లూరు(అర్బన్): తీవ్రమైన తలనొప్పి, శ్వాస తీసుకోలేకపోవడం వంటి సమస్యలతో బాధపడుతున్న ఓ బాలుడికి అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా చేసి ఆరోగ్యాన్ని కాపాడామని నారాయణ స్పెషాలిటీ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. శనివారం నగరంలోని నారాయణ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో పాటు ఈఎన్‌టీ విభాగాధిపతి కృష్ణచైతన్య శస్త్రచికిత్స వివరాలు వెల్లడించారు. పొదలకూరుకు చెందిన 12 ఏళ్ల అభినందన్ సైనో నాసల్ ఫంగల్ పాలిపాయిడల్ గ్రోత్ అనే అరుదైన జబ్బుతో బాధపడుతుండగా ఆరోగ్యశ్రీ ద్వారా ఒక్కరూపాయి ఖర్చు లేకుండా విజయవంతంగా సర్జరీ చేసి బాలుడి ఆరోగ్యాన్ని కాపాడామన్నారు. ఈ సమావేశంలో వైద్యులు హిమజ, రమేష్‌బాబు, ఇంద్రనీల్, అనస్తీషియన్ షైనీ, ఆస్పత్రి ఏజీఎం చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆదాల విజయం కోసం ప్రార్థనలు



నెల్లూరు సిటీ: రానున్న ఎన్నికల్లో నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుంచి ఆదాల ప్రభాకర్‌రెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధించాలని, తిరిగి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రావాలని సెంట్రల్ రైల్వే బోర్డు మెంబర్ స్వర్ణ వెంకయ్య ఆధ్వర్యంలో పాస్టర్లు శనివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఏప్రిల్ మొదటి వారంలో రూరల్ నియోజకవర్గంలో నిర్వహించనున్న సేవకుల ఆత్మీయ సమావేశం ఏర్పాటుపై చర్చించారు. పాస్టర్ ఎస్ జోసఫ్ బాబు, రూరల్ అండ్ యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజలే జగనన్న నమ్మకం

• వైఎస్సార్‌సీపీ నగర ఎమ్మెల్యే అభ్యర్థి ఎండీ ఖలీల్‌అహ్మద్

నెల్లూరు (స్టౌన్‌హౌస్‌పేట): ప్రజలే జగనన్న నమ్మకమని వైఎస్సార్‌సీపీ నగర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎండీ ఖలీల్‌అహ్మద్ పేర్కొన్నారు. నగరంలోని 45వ డివిజన్ జేమ్స్ గార్డెన్స్, వెంకట్రామపురం, వేదంవారి అగ్రహారం, శ్రీనివాస అగ్రహారం, తదితర ప్రాంతాల్లో శనివారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖలీల్ అహ్మద్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు అందించిన సంక్షేమాభివృద్ధే వైఎస్సార్‌సీపీ గెలుపునకు దోహదపడుతుందన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికి వెళ్లిన సమయంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందిన ప్రతిఒక్కరూ వైఎస్సార్‌సీపీని ఆశీర్వదిస్తున్నారన్నారు. జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి అయితే నవరత్నాలు అందుతాయన్న సంతోషంలో ప్రజలు ఉన్నారన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యకు పెద్దపీట వేస్తూ నాడు-నేడు కింద మున్సిపల్ పాఠశాలలను ఎంతో అభివృద్ధి చేశారని తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు అమ్మఒడి పథకం కింద తల్లుల ఖాతాల్లో రూ.15 వేలు జమ చేస్తున్నారని వివరించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే సామాన్యుడినైన తనకు జగనన్న ఒక్క అవకాశం కల్పించారని, తనను ఆశీర్వదిస్తే మీ బిడ్డగా అందుబాటులో ఉండి సేవ చేసుకుంటానన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి విజయసాయిరెడ్డి, నగర నియోజకవర్గ అభ్యర్థి అయిన తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్పొరేటర్ మూదిరెడ్డి వేదవతి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎండీ ఖలీల్ అహ్మద్

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఈఆర్వో వికాస్‌మర్మత్

• నగర నియోజకవర్గ ఈఆర్వో వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): ఎన్నికల విధుల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని నగర నియోజకవర్గ ఈఆర్వో వికాస్‌మర్మత్ సూచించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నగర నియోజకవర్గ ఎన్నికల సిబ్బందితో శనివారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో ఎన్నికల ప్రకటన తేదీ నుంచి ఎన్నికలు పూర్తయ్యే వరకు చేపట్టాల్సిన విధివిధానాలను వివరించారు. ఈఎస్‌ఎంఎస్ బృందం చెక్ పోస్టుల నిర్వహణను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలన్నారు. తనిఖీల్లో మద్యం, ధనం, మారణాయుధాలు పట్టుబడిన సందర్భాల్లో తీసుకోవాల్సిన చర్యలను ఆర్వో వివరించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో సిబ్బందికి వర్తించే ప్రత్యేకాధికారాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సామాన్య ప్రజానీకానికి ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పించి, ఎన్నికల కోడ్ అమల్లో వారికి అసౌకర్యం కలగకుండా పర్యవేక్షించాలని సూచించారు. అదనపు కమిషనర్ శర్మద, ఏఈఆర్వోలు దేవీకుమారి, డీసీపీ వెంకటరమణ, తహసీల్దార్లు వెంకటేశ్వరరావు, ప్రసాద్‌రావు, టీపీఆర్వో ప్రసాద్ పాల్గొన్నారు.

ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలి

నెల్లూరు(దర్గామిట్ట): సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున ప్రభుత్వ ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి శనివారం ఒక ప్రకటనలో సూచించారు. ప్రభుత్వ ఉద్యోగుల ప్రవర్తన నిస్పక్షపాతంగా ఉండాలని, రాజకీయ పార్టీల అభ్యర్థులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్న సందేహాలు, ఆరోపణలకు ఆస్కారం ఇవ్వొద్దన్నారు. రాజకీయ పార్టీలు నిర్వహించే సమావేశాలు, ప్రచారాలకు ఉద్యోగులు దూరంగా ఉండాలన్నారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిన ప్రభుత్వ ఉద్యోగులపై ఐపీసీ సెక్షన్లు 171, 123ఏ కింద ఎన్నికల కమిషన్ క్రమశిక్షణా చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికలు పూర్తయ్యే వరకు జాగ్రత్తగా వ్యవహరించాలని, నిష్పక్షపాతంగా నిబంధనలు మేరకు ఎన్నికల విధులు నిర్వర్తించాలని సూచించారు.

మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారం అభినందనీయం

మహిళా ఉద్యోగులకు సంబంధించి దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పలు సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించడం అభినందనీయమని ఏపీఆర్‌ఎస్‌ఏ జిల్లా నేతలు అల్లంపాటి పెంచలరెడ్డి, కే బాలకోటమ్మ, ప్రసాద్, తదితరులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పిల్లలకు 18 సంవత్సరాలు వచ్చేలోపే మహిళా ఉద్యోగులు చైల్డ్ లీవులను వాడుకోవాలన్న నిబంధనను తొలగించడం, ప్రొబేషన్ కాలంలో మహిళా ఉద్యోగుల మెటర్నిటీ లీవులు వాడుకుంటే డ్యూటీ పీరియడ్‌గా పరిగణించడం అభినందనీయమన్నారు.